పరశురాముడు

వాణిశ్రీ

"మనం ఇంకా ఎన్నిరోజులు ఈ హోటల్లో వుండాలి?" విసుగ్గా అంది మాలతి.

"ఏం ఇక్కడ బాగాలేదా?" అన్నాడు మోహన్.

"ఎంతో హాయిగా ఉంది. గదిలోనే అన్ని సౌకర్యాలూ ఉన్నాయ్. బెల్ నొక్కితే కాఫీ, ఫలహారం, భోజనం రెక్కలు కట్టుకుని వాల్తాయి!"

"మరింకేం?"

"డబ్బు మంచినీళ్ళలా ఖర్చయిపోవడం లేదూ! ఇలా కొన్నాళ్ళు గడిస్తే మన గతి ఏమిటి?"

"మాలతీ! అనవసరమైన ఆలోచనలు పెట్టుకుని మనసు పాడుచేసుకోకు. ఇలా సుఖంగా గడిపే రోజులు మనకు మళ్ళీ రావు."

"సుఖం చూసుకుంటే మరి మన భవిష్యత్తు?"

"ఎలా రాసివుంటే అలా జరుగుతుంది."

"బాగుందండీ మీ వేదాంతం. మీ అత్తయ్య ఎవరో

ఈ ఊళ్ళో ఉందన్నారుగా? మీకు ఏదైనా ఉద్యోగం దొరికేదాకా వాళ్ళింట్లో ఉందాం! ఖర్చు తగ్గుతుంది కదా!" అంది మాలతి.

"నీకు మరీ జాగ్రత్త ఎక్కువ. సరే! నేను రాత్రి ఎనిమిదింటికి ఒక శేఠ్ గారిని కలవాల్సిన పని వుంది. వాళ్ళ ఫ్యాక్టరీలో ఉద్యోగం వస్తుందని నాకు నమ్మకం ఉంది. ఈ లోపల అత్తయ్యను ఇక్కడకు పంపిస్తాను. నువ్వు వాళ్ళింటికి వెళ్ళు. నేను సరాసరి అక్కడికే వస్తాను. రేపు హోటల్ గది ఖాళీచేద్దాం! ఓ.కే" అన్నాడు మోహన్.

"మీ అత్తయ్యను ఇక్కడికి పంపించడం బాగుంటుందా? నేనూ మీతో వస్తాను. నన్ను అక్కడ వదిలి మీరు వెళ్ళొచ్చును కదా!" అంది మాలతి.

"ఇప్పుడే ఏడు దాటింది. ఎనిమిదింటికి రమ్మని ఆ శేఠ్ చెప్పాడు. చెప్పిన టైమ్‌కి వెళ్ళకపోతే నాకు ఉద్యోగం ఇస్తాడా? నువ్వు లేనిపోని అనుమానాలు పెట్టుకోకు. నేను అత్తయ్యకు ఫోన్ చేసి చెప్తాను. కారులో వచ్చి నిన్ను తీసుకెళ్తుంది. ఓ.కే" అన్నాడు మోహన్.

"మీ అత్తయ్య వాళ్ళకి ఫోను, కారు ఉన్నాయా?" ఆశ్చర్యంగా ప్రశ్నించింది మాలతి.

"వూఁ....ఏమనుకున్నావు....?" అంటూ మోహన్ ఆమెను దగ్గరకు తీసుకుని కౌగలించుకున్నాడు.

మాలతిని ముద్దుపెట్టుకుని వదిలి "కీస్ అత్తయ్యకి ఇవ్వు.... నేను వెళ్ళొస్తాను" అన్నాడు మోహన్.

మాలతి తల వూపింది.

మోహన్ తలుపు దగ్గరకు లాగి వెళ్ళిపోయాడు.

మాలతి బెడ్ మీద వాలింది.

మధురమైన వూహాలు మనసులో మెదిలాయి. బంగారు భవిష్యత్తు వూహించుకుంటూ కళ్ళుమూసుకుంది.

2

రాత్రి పది కావొచ్చింది.

హోటల్లో సందడి సద్దు మణిగింది.

మాలతి హోటల్ గదిలో కాలుకాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతోంది. కడుపులో ఎలుకలు పరిగెత్తుతున్నాయ్! ఆకలి దంచుతోంది. బాయ్ రెండు మూడు సార్లు వచ్చి అడిగివెళ్ళాడు "భోజనం తెమ్మంటారా?" అని. ఆమె సందిగ్ధావస్థలోపడింది. "భోజనం చెయ్యాలా వద్దా?" అని.

మోహన్ అత్తయ్య వచ్చి తనను వాళ్ళింటికి తీసుకెళ్తుందని చెప్పి వెళ్ళాడు. పది కావచ్చినా ఆమె ఇంకా రాలేదు. మోహన్ ఆమెకు ఫోన్ చేసి చెప్పాడా? లేదా? ఒక వేళ ఆమె ఇంట్లో లేదేమో? పోనీ మోహన్ అయినా రావచ్చుగదా? ఎందుకు రాలేదు.

మోహన్ అత్తయ్య కోసం ఆమె రెండు గంటల నుంచి నిరీక్షిస్తోంది! క్షణం....క్షణం....నిరీక్షణ!....పరమ బోర్!

మాలతికి మోహన్ మీద కోపం ముంచుకొచ్చింది.

తలుపు టక్....టక్ మని శబ్దం చేసింది.

ఎవరో తలుపు తడుతున్నారు.

మాలతి 'హమ్మయ్య' అనుకుంది. ఆమె ముఖంలోకి కళ వచ్చింది. మోహన్ వచ్చివుంటాడు. లేదా, అతని అత్తయ్య వచ్చివుంటుంది.

బోల్టు తీసి తలుపు తెరిచి నివ్వెరపోయి నిల్చుండి

పోయింది.

అతను నల్లగా, పొడుగ్గా ఉన్నాడు. రాగిరంగు జుట్టు భుజాలమీద పడుతోంది. మీసాలు కూడా రాగి రంగులో ఉన్నాయి. పిల్లి కళ్ళలో క్రూరత్వం కనిపిస్తోంది. గ్లాస్కో లాల్చీ, పైజామా వేసుకుని ఉన్నాడు.

"మీరేనా మాలతి గారంటే?" అన్నాడు ఆమెను ఎగాదిగా చూస్తూ.

"ఆఁ.... నేనే!....ఎవరు నువ్వు?" అంది మాలతి.

"మోహన్ బాబుగారి అత్తయ్య క్రింద కారులో ఉన్నారు. మిమ్మల్ని రమ్మన్నారు" అన్నాడు.

ఆమెకు సంతోషం కలిగింది. ఆమె కోసమేగదా రెండు గంటలనుంచి నిరీక్షిస్తోంది. ఇప్పటికైనా వచ్చింది. అంతే చాలన్నట్లు ఆమె గబగబా కిటికీ తలుపులు మూసింది. గదికి తాళంవేసి, హేండ్ బ్యాగ్ తీసుకుని అతనివెంట బయల్దేరింది.

అతను రోడ్డు ప్రక్కన నిల్చున్న ఆకుపచ్చ రంగు అంబాసిడర్ కారు దగ్గరికి మాలతిని తీసుకెళ్ళాడు. బ్యాక్ డోర్ తెరిచాడు. లోపల మోహన్ అత్తయ్య కూర్చుని వుందని ఆమె గ్రహించింది.

"నమస్తే!" అంది మాలతి.

ఆమె ప్రతి నమస్కారం చెయ్యలేదు.

"దా....దా....!" అంది నవ్వుతూ.

ఆమె నోరు ఎర్రగా కనిపించింది పెద్ద పులి నోరులా. పళ్లు గారబట్టి అసహ్యంగా ఉన్నాయి. ఆమెకు దాదాపు ఏభై ఏళ్ళుండవచ్చు. మనిషి నల్లగా తారుడబ్బాలా వుంది. అంగుళం మందాన మేకప్ మాత్రం కొట్టుకుంది. ఆమె కళ్ళు కూడా ఎర్రగా డేంజర్ లైట్లలా వెలుగు

తున్నాయి. లావుపాటి శరీరానికి పల్చటి నైలెక్స్ చీర కట్టుకుంది. ఆమె చవకబారు మనిషిలా కనిపించింది మాలతికి.

ఒక్క క్షణం అలాగే నిలబడి పోయింది. మోహన్ అత్త ఇలా వుందేమిటి? అనే అనుమానం కలిగింది.

"దా....నిలబడి పోయావేంటి?" అంది ఆమె మొరటుగా.

మాలతి కారులో కూర్చుంది.

అతను డోర్ వేశాడు.

డ్రైవర్ మాలతిని తినేటట్లు చూస్తుంటే ఆమెకు కంపరం ఎత్తుతోంది.

అతను ఫ్రంట్ సీట్లో కూర్చుని డోర్ వేసి "ఏందిరా వెర్రినాకొడకా అట్లా ఎగాదిగా చూస్తావేంటి!పోనియ్!" అన్నాడు.

డ్రైవర్ తేరుకుని కారు స్టార్టు చేశాడు.

"ఏంటి నీ పేరు?" నవ్వుతూ అంది.

మాలతికి కంపరం యెత్తుతోంది ఆమెను చూస్తుంటే. ఆమె ప్రవర్తన చిరాకు కలిగిస్తోంది.

"మాలతి."

"నా పేరు దుర్గమ్మ. మీ ఆయన నా అల్లుడు" అంది పకపకా నవ్వుతూ.

డ్రైవర్, అతని ప్రక్కన కూర్చున్న పొడుగాటివాడు గుసగుసలాడుకుంటూ, అప్పుడప్పుడూ వెనక్కి తిరిగి తనని చూసి నవ్వుకోవడం చూసి మాలతికి వళ్ళు మండుకు పోతోంది.

యజమానురాలు ఉండగానే డ్రైవరు నౌకరు అంత విచ్చల విడిగా ప్రవర్తిస్తున్నారేవిటి? ఈవిడ అంటే

వాళ్ళకి గౌరవం ఉన్నట్లులేదు.

"ఏంటమ్మాయ్! ఏదైనా చెప్పు? మోహనూ నువ్వూ తిరపతిలో పెళ్ళి చేసుకున్నారంటగా! ఆడు చెప్పాడులే!"

"అవునండీ!" అంది మాలతి.

"మంచి అందగాడినే పట్టావ్!" అంది దుర్గమ్మ వెకిలిగా నవ్వుతూ.

'ఛీ...ఇదేం మినిషి? బొత్తిగా సభ్యతలేకుండా మాట్లాడుతుందేం?' అనుకుంది మాలతి.

మాలతి తలవంచుకుని ఆలోచిస్తూ సీటులో వున్న కాగితం ప్యాకెట్ వంక చూసింది. మాలతి దానివంక తదేకంగా చూడ్డం గమనించి దుర్గమ్మ "తింటావా? ద్రాక్షకాయలు" అంటూ ప్యాకెట్ విప్పింది.

"వద్దు...." అంది మాలతి అయిష్టంగా.

"ఫర్వాలేదులే తిను" అంటూ ఒక ద్రాక్ష గుత్తి పేపరులో పెట్టి ఇచ్చింది దుర్గమ్మ.

మాలతికి తిన బుద్ధి కాలేదు. ద్రాక్ష గుత్తి ప్రక్కన పెట్టి పేపరుముక్క చేతిలోకి తీసుకుని, మసక కాంతిలో చదువుతూ కూర్చుంది. అది యెప్పటిదో పాత పేపరు. అందులో బాక్సు కట్టిన ఒక వార్త ఆమెకు ఆసక్తి కలిగించింది.

'ఢిల్లీ నగరంలో ఇద్దరు యువతులను ఉద్యోగం ఇప్పిస్తామని మోసంచేసి వాళ్ళని తీసుకొచ్చి వ్యభిచార గృహానికి అమ్మివేశారు. ఇంత చేస్తే వాళ్ళు ఆ యువతులకు బంధువులే. చివరకు పోలీసులు వాళ్ళకి విముక్తి కలిగించారు. కాబట్టి ఈ రోజుల్లో బంధువుల్ని కూడా నమ్మగూడదన్న మాట!' అంటూ రాశాడు న్యూస్

విలేఖరి.

మాలతి మనసులో ఒక మెరుపు మెరిసింది. దుర్గమ్మని, ఆమె బంటునీ, డ్రైవర్‌నీ మార్చి, మార్చి చూసింది. తను మోహాన్ని గుడ్డిగా నమ్మి వచ్చింది. ఒకవేళ అతను తనను మోసం చెయ్యలేదుగదా! తనను ఈ దుర్గమ్మకు అమ్మివేశాడా కొంపతీసి. దుర్గమ్మ సంసార స్త్రీలా లేదు.

ఏం చేయాలి ఇప్పుడు? తను సాలెగూటిలోకి పోవడం లేదు గదా!

మాలతి భయంతో వణికిపోయింది.

కారు వేగంగా పోతోంది మెయిన్ రోడ్డుమీద.

తను కేకలు పెడితే?

లాభంలేదు. ఈ దుర్గమ్మ తన నోరు నొక్కేస్తుంది.

తను తప్పుకోవడం ఎలా?

"అరె.... రె....!" అంది మాలతి గట్టిగా.

"ఏంటి?" అంది దుర్గమ్మ.

"నా నెక్లెస్!" నాలిక కరుచుకుంది మాలతి.

"ఏమైంది? పోయిందా?"

"లేదు. సూట్‌కేసులో మర్చిపోయాను. కారు హోటల్ దగ్గరకి త్రిప్పండి."

దుర్గమ్మ కళ్ళు మెరిశాయి.

"సూరీ! బండితిప్పరా!" అంది.

కారు వెనక్కి త్రిప్పి హోటల్ దగ్గరికి పోనిచ్చాడు డ్రైవర్.

మాలతి కారు దిగి హోటల్లోకి పరిగెత్తుతున్నట్లుగా వెళ్ళింది.

దుర్గమ్మ సైగ అర్థంచేసుకుని ఆమె బంటు కోటయ్య మాలతిని అనుసరించాడు.

తనను నల్లటి పొడుగాటి వాడు వెంబడించినట్లు గ్రహించింది మాలతి. ఆమె అనుమానం నిజమైంది. మోహన్ తనని మోసం చేశాడు. దుర్గమ్మ దగ్గర డబ్బు తీసుకుని తనను అమ్మివేశాడు. మాలతి శరవేగంతో మేడ మెట్లు ఎక్కింది. ఆమె వుంటున్న గది మూడో అంతస్థులో వుంది.

మాలతి రొప్పుకుంటూ తాళంతీసి లోపలకు ప్రవేశించే లోపల కోటయ్య రానేవచ్చాడు. మాలతి వెంట గదిలోకి వచ్చేశాడు.

"బైటనుంచో!" అంది మాలతి దబాయిస్తూ.

కోటయ్య మాట్లాడలేదు. వికటంగా నవ్వాడు.

"ఏమిటి అట్లా నవ్వుతావు?"

"తొందరగా నడువు" అన్నాడు.

"ఎక్కడికి?"

"మీ అత్తగారింటికి!" అని నవ్వాడు.

"నేను రానిప్పుడు. ఆయన వచ్చాక వస్తాను."

"ఆయన ఇక రాడు."

"ఎందుకు రాడు?"

"నిన్ను మాకు అమ్మేశాడు."

మాలతికి కళ్ళు తిరిగినట్లయింది.

ఆమె మనసులో ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. వీడు తనను బలవంతంగానైనా ఎత్తుకుని వెళ్తాడు అనుకుంది. వాడికి చిక్కగూడదు. ఏంచెయ్యాలి?

ఆమె కళ్ళకు కిటికీలోంచి డ్రైనేజి గొట్టం కనిపిస్తోంది. మాలతి ధైర్యం తెచ్చుకుంది. కిటికీ తీసి గొట్టాన్ని పట్టుకుంది. ఒక్క నిమిషం వుంటే గొట్టం ద్వారా క్రిందకు జారివుండేది.

కాని కోటయ్య వూరుకోలేదు. ఆమె చెయ్యి అందు కున్నాడు. ఆమె ఒకచేత్తో గొట్టాన్ని పట్టుకుంది. కోటయ్యని విడిపించుకోవడానికి పెనుగులాడింది.

పెనుగులాటలో ఆమె జారిపోయింది. దభీమని మూడో అంతస్తునుంచి పడిపోయింది మాలతి.

కోటయ్య క్రిందకు పరుగుతీశాడు.

మాలతి మేడపైనుంచి క్రిందపడటం చూసిన దుర్గమ్మ కోటయ్య రాకుండానే కారులో వెళ్ళిపోయింది.

రక్తపు మడుగులోపడి కొట్టుకుంటున్న మాలతిచుట్టూ జనం చేరారు.

తను మేడ దిగేసరికి అక్కడ కారు లేకపోవడం చూసి కోటయ్య నెమ్మదిగా హోటల్‌లోంచి జారు కున్నాడు.

3

రాత్రి పన్నెండింటికి పోలీస్ వ్యాన్ హోటల్ సురేఖ ముందు ఆగింది.

ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి వ్యాన్ దిగాడు.

హోటల్ మేనేజర్ ఎదురు వచ్చి విష్ చేశాడు.

"ఆమెకు ఎలా వుంది సార్?" అన్నాడు.

ఇన్స్‌పెక్టర్ పెదవి విరిచి "దారిలోనే పోయింది. డెడ్‌బాడీ పోస్టుమార్టమ్ చెయ్యడానికి హాస్పిటల్లోనే వదిలి వచ్చాను" అన్నాడు.

"పాపం...." అన్నాడు మేనేజర్.

"యఫ్. ఐ. ఆర్. పంపించాలి. పదండి మీరు స్టేట్ మెంట్ ఇద్దురుగాని" అన్నాడు.

ఇద్దరూ ఆఫీసు రూమ్‌లోకి వెళ్ళారు.

విజిటర్స్ రిజిష్టర్ తెచ్చి ఇన్స్‌పెక్టర్ ముందు

వుంచాడు మేనేజర్.

"వారంనుంచి ఉంటున్నారన్నమాట" అన్నాడు ఇన్స్పెక్టర్.

తల వూపాడు మేనేజర్.

"అయితే మోహన్ అనే అతను ఇప్పటి వరకూ రాలేదు గదా!"

"అవును సార్!"

"అతన్ని ఇంతకుముందు ఎప్పుడైనా చూశారా?"

"లేదు సార్!"

"ఇంకేం చెప్తారు ఈ సంఘటన గురించి?"

"నాకు ఏమీ అర్థం కావడంలేదు సార్! ఈ సంఘటన జరిగిన తర్వాత నల్లగా పొడుగ్గా వున్న వాడొకడు హడావుడిగా పోతూ వుండడం మా బాయ్ చూశానని చెప్పాడు."

"అంటే ఎవరో ఆమెను పైనుంచి నెట్టివేశారని మీరు అనుకుంటున్నారా?"

"అవును. లేకపోతే ఆమె అక్కడ్నుంచి క్రింద పడాల్సిన పని ఏమిటి?"

"ఆత్మహత్య కాగూడదా?"

మేనేజర్ ఆలోచనలో పడ్డాడు.

"నేను అలా అనుకోవడంలేదు."

"ఏం? ఎందుకని?"

"జనరల్‌గా ఆడవాళ్ళు అలా చెయ్యరు. ఉరిపెట్టుకోవడమో, కిరసనాయిలు వంటిమీద పోసుకుని కాల్చుకోవడమో చేస్తుంటారు."

"వూఁ...."

"వాళ్ళిద్దరూ క్రొత్తగా పెళ్ళయిన వాళ్ళలా కని

పించారు. పెద్దవాళ్ళకి ఇష్టంలేకుండా చేసుకునివుండొచ్చు. కుర్రాడి తరఫు వాళ్ళు ఆమెపై పగపట్టి ఈ ఘాతుకానికి తలపడ్డారేమో?"

"కావచ్చు."

"ఆ మోహాన్ని గూడా బలవంతంగా ఇంటికి తీసికెళ్ళిపోయారేమో?"

"ఈ సంఘటన మీరు చూశారా? ఐ మీన్ మీరు అప్పుడు అక్కడున్నారా అని...." అన్నాడు ఇన్స్పెక్టర్.

"నేను ఇక్కడే ఉన్నాను. మా బాయ్ ఒకడు వచ్చి చెప్పాక వెళ్ళాను. అదీగాక అది బిల్డింగ్ వెనుక ప్రక్క కావటాన ఎవరూ చూల్లేదు."

"ఐ....సీ....నల్లగా పొడుగ్గా ఉన్న వాడిని మీ బాయ్ చూశాడన్నారు గదా!"

"అవును."

"మరి అతన్ని మీ రిసెప్షనిస్టు చూళ్ళేదా?"

"ఏమో సార్! నేను అతన్ని అడగలేదు."

"ఉన్నాడా అతను."

"ఉన్నాడు" అని బెల్ నొక్కాడు మేనేజర్.

బాయ్ వచ్చాక రిసెప్షన్ కుమార్ని పిలిపించాడు మేనేజర్. తెల్లటి దుస్తుల్లో టక్ చేసుకుని కళ్ళద్దాలు పెట్టుకున్న యువకుడు లోపలకు వచ్చి విష్ చేశాడు.

"మీరేనా రిసెప్షన్లో వుంది."

తల వూపాడు కుమార్.

"మాలతి మేడపైనుంచి పడ్డ తర్వాత పొడుగ్గా నల్లగా వున్న వాడొకడు హడావుడిగా బైటకు వెళ్ళి

పోయాడని మా బాయ్ చెప్పాడు. అతన్ని మీరు చూశారా?"

"మాలతి మొదట అతనితో పాటే కారులో ఎక్కడికో వెళ్ళింది. పదినిమిషాల తర్వాత కారులో వచ్చి దిగింది. మాలతి పైకి వెళ్ళిన తర్వాత అతనూ పైకి వెళ్ళాడు. కాసేపటికి ఇది జరిగింది."

"హూఁ .... తర్వాత. అతను వెళ్ళిపోవడం మీరు చూశారా?"

"లేదు. ఆమె క్రిందపడడం ఒక బాయ్ చూసి పెద్దగా కేక పెట్టాడు. నేనా కేక విని హడావుడిగా వెళ్ళిపోయాను."

"అతను ఎలా ఉంటాడు?"

"నల్లగా, పొడుగ్గా ఉన్నాడు. లాల్చీ, పైజామా వేసుకున్నాడు. అతని జుట్టు రాగి రంగులో వుంది. అతనివి పిల్లికళ్ళు" అన్నాడు కుమార్.

"ఆ కారులో ఇంకెవరైనా ఉన్నారా?"

"కారు బ్యాక్ సైడ్‌లో నిలబడి ఉంది. లోపల ఎవరో ఉన్నట్లే ఉన్నారు. తలమాత్రం చూశాను."

"కారు ఏ రంగులో ఉంది?"

"ఆకుపచ్చ రంగులో ఉంది."

"నెంబరు గుర్తుందా?"

"యమ్. వై. యస్. నూటపదకొండు."

"బాగా గుర్తుపెట్టుకున్నారే!"

"ఆ కారు రెండుసార్లు రావడంతో గుర్తుంది" అన్నాడు కుమార్.

"ఆ తర్వాత కారు ఎప్పుడు వెళ్ళిపోయిందో మీరు గమనించారా?"

"బాయ్ కేక వినిపించగానే నేను కౌంటర్ వదిలి వెళ్ళిపోయాను. ఆ కారు ఎప్పుడు వెళ్ళిపోయిందో నేను చూళ్ళేదు" అన్నాడు కుమార్.

ఇన్స్పెక్టర్ మేడపైకి వెళ్ళి రూమ్ నెంబర్ నూట పదమూడు తాళం తీయించాడు.

మాలతి భర్త తాలూకు ఒక లుంగీ బనీను, కట్ డ్రాయర్ మాత్రం స్టాండ్ మీద ఉన్నాయి. సూట్ కేసు తీసేవుంది. అందులో ఒక జత బట్టలు మాత్రమే ఉన్నాయి. వాటిమీద టైలర్ లేబుల్స్ లేనేలేవు. మాలతి చీరలు, బ్లౌజులు వగైరా ఉన్నాయి.

సూట్ కేస్ అడుగున ఒక కార్డు కనిపించింది. అది అమలాపురంలో పోస్టు చేసింది. ఫ్రమ్ అడ్రస్ లేదు. అమలాపురం అని మాత్రమే వుంది. వెంకట్రామయ్యగారికి అని సంబోధించి ఉత్తరం రాశాడు రాజశేఖరం అనే ఆయన. మే నెలలో ముహూర్తం నిశ్చయించి తెలియ పరచమని అందులో సారాంశం. టూ అడ్రస్ వెంకట్రామయ్యది. కేరాఫ్ సీతారామస్వామి, ప్లీడర్, రాజమండ్రి.

ఆ పోస్టుకార్డు డైరీలో పెట్టుకున్నాడు. అక్కడున్న బాయ్‌ని ప్రశ్నించాడు. పనికి వచ్చే సమాచారం వేరే ఏదీ రాలేదు. ఆ పూట మాలతి భోజనం చెయ్యలేదని మాత్రం చెప్పాడు బాయ్.

రూమ్‌కి సీలు వేయించి మళ్ళీ వస్తానని అక్కడ్నుంచి బయల్దేరి వెళ్ళాడు ఇన్స్పెక్టర్.

4

మార్చురీలో ఉన్న మాలతి శవాన్ని చూసి బావురు మన్నాడు వెంకట్రామయ్య.

వెంకట్రామయ్య తేరుకున్నాక మాలతి గురించి చెప్పాడు.

మాలతి వెంకట్రామయ్య మూడో కూతురు. ఇద్దరికి పెళ్ళిళ్ళు చేశాడు. అతనికి సుందర్రావు అని ఒక్కడే కొడుకు. మాలతి పెళ్ళి రాజశేఖర్ అనే టీచర్‌తో నిశ్చయమైంది. కాని అతనికిది రెండో పెళ్ళి. నలభై ఏళ్ళుంటాయి అతనికి. ఇద్దరు పిల్లలు. అంగకంటే మంచి సంబంధం తీసుకురాలేక మాలతిని రాజశేఖరానికిచ్చి పెళ్ళిచెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

మాలతికి ఈ సంబంధం ఇష్టంలేదు. పదిహేనురోజుల క్రితం తను ప్రేమించిన మనిషితో వెళ్ళిపోతున్నాననీ, తనకోసం అనవసరంగా వెతకవద్దనీ ఉత్తరం రాసి వెళ్ళిపోయింది మాలతి.

ఇప్పుడు పోలీసులు మెసేజ్ ఇచ్చేవరకూ తనకు మాలతి సమాచారం తెలియలేదు. మోహన్ అనే వాడెవడో తనెప్పుడూ చూళ్ళేదు.

"మాలతి ఇంట్లోనుంచి వెళ్ళిపోయినప్పుడు ఆమె వంటి మీద నగలు ఏమైనా ఉన్నాయా?" ప్రశ్నించాడు ఇన్స్పెక్టర్.

"మెళ్ళో ఒంటి పేట గొలుసు. రెండు జతల గాజులు. చెవులకు దుద్దులు ఉన్నాయి."

"ఆమె మెడలో ఉన్న మంగళసూత్రం గూడా రోల్డుగోల్డుదే. బంగారు గాజులు, గొలుసు లేనేలేవు. చెవులకు దుద్దులు మాత్రం ఉన్నాయి" అన్నాడు ఇన్స్పెక్టర్.

"మోహన్ అనే అతను మీ అమ్మాయిని వారంరోజుల్నుంచి హోటల్లో వుంచాడు. తను భార్యతో వచ్చానని విజిటర్స్ రిజిష్టర్లో రాశాడు. తను విశాఖపట్నం నుంచి

వచ్చానని ఏదో అడ్రస్ ఇచ్చాడు. ఆ అడ్రస్‌లో అతను లేడని మాకు సమాచారం వచ్చింది. బహుశా అది తప్పుడు అడ్రస్ కావచ్చు ననుకుంటున్నారు" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

వెంకట్రామయ్య విచారంగా కూర్చున్నాడు.

"వాడెవడో నా తల్లిని మోసం చేశాడు" అన్నాడు వెంకట్రామయ్య ఏడుస్తూ.

ఇనస్పెక్టర్ అతన్ని ఓదార్చి శవాన్ని రాజమండ్రి తీసుకువెళ్ళే ఏర్పాటు చేశాడు.

5

"హలో...." అన్నాడు ఇనస్పెక్టర్ కృష్ణమూర్తి రిసీవర్ ఎత్తి.

"సార్! నేను త్రీఫార్టీవన్‌ని మాట్లాడుతున్నాను."

"చెప్పు!"

"సార్! నూట పదకొండో నెంబరు కారు దొరికింది."

"ఎక్కడ?"

"హామీద్ షెడ్‌లో వుంది సార్!"

"ఎక్కడ ఆ షెడ్?"

"శ్రీదేవి టాకీస్ ప్రక్కసందులో సార్!"

"నువ్వు శ్రీదేవి దగ్గర వుండు. నేను ఇప్పుడే వస్తున్నాను" అని రిసీవర్ క్రెడిల్ చేసి బయలేరాడు.

శ్రీదేవి దగ్గర కానిస్టేబుల్ ఇన్స్‌పెక్టర్ కోసం ఎదురు చూస్తూ వున్నాడు. పోలీస్ జీప్ రాగానే వచ్చి సెల్యూట్ చేశాడు.

షెడ్ దగ్గరికి వెళ్ళేసరికి హామీద్ "సలాం సాబ్!" అన్నాడు జీవ్ దగ్గరికి వచ్చి.

ఇనస్పెక్టర్ జీవ్ దిగి షెడ్‌లోకి వెళ్ళాడు. కానిస్టేబుల్

చెప్పింది నిజమే. ఆకుపచ్చ రంగు అంబాసిడర్ కారు అక్కడ వుంది. యమ్.యస్.వై. నూటపదకొండు దాని నెంబర్.

"ఈ కారు ఎవరిది?"

"డాక్టర్ బసవరాజుగారిది సాబ్!"

"రిపేరు కొచ్చిందా?"

"హూ సాబ్!"

"ఎన్నాళ్ళ నుంచి నీ దగ్గర వుంది?"

"వారం నుంచి సాబ్!"

"ఏమిటీ వారం నుంచా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు ఇనస్పెక్టర్.

"హూ సాబ్!" అన్నాడు హామీదు.

"సరిగా చెప్పు."

హామీదు పుస్తకం తెచ్చి చూపించాడు. డాక్టర్ బసవరాజు గారు రీబోర్ చెయ్యమని తన షెడ్ కి పంపించిన రికారు అది.

"అయితే మూడు రోజుల క్రితం అంటే పదిహేడు రాత్రి ఈ బండి వూళ్ళో తిరిగింది. ఎవరు డ్రైవ్ చేశారు?"

హామీదు ఆశ్చర్యపడ్డాడు.

"ఆ రోజు నేను వూళ్ళో లేను సాబ్! నాకు తెలియకుండా ఎవరూ బండి తీసికెళ్ళరు" అన్నాడు.

"ఎవరో తీసికెళ్ళారు. ఆ రోజు రాత్రి పదిగంటల ప్రాంతంలో హూటల్ సురేఖ దగ్గరుంటే ఈ బండిని చూసిన వాళ్ళున్నారు. ఆ రోజు హూటల్ మూడో అంతస్తు నుంచి క్రిందపడి చనిపోయిన మాలతి అనే అమ్మాయి ఈ బండిలోనే అక్కడికి వచ్చింది" అన్నాడు ఇనస్పెక్టర్.

హమీద్ బిగుసుకుపోయాడు.

"సాబ్! నిజవేఁనా?"

"నిజమే!"

హమీద్ షెడ్‌లోకి వెళ్ళి "జహంగీర్! ..." అని కేక పెట్టాడు.

"అయా!...." అంటూ ఒక కుర్రవాడు వచ్చాడు.

ఆ రోజు బండిని తీసికెళ్ళింది ఎవరు? అని వుర్దూలో అడిగాడు జహంగీర్‌ని. జహంగీర్ ముందు లేదన్నాడు. హమీద్ చెంపమీద గట్టిగా రెండిచ్చుకునేసరికి నిజం చెప్పాడు. జహంగీర్ హమీద్ కొడుకే. ఇరవై ఏళ్ళుంటాయి అతనికి. ఆ రోజు రాత్రి తొమ్మిదింటికి సూరిగాడు బండి తీసికెళ్ళాడని జహంగీర్ చెప్పాడు.

హమీదు ఇనస్పెక్టర్ చెప్పింది నిజమేనసీ, తను వూళ్ళో లేనప్పుడు సూరిగాడనే కుర్రమెకానిక్ ఆ బండి తీసికెళ్ళి వూళ్ళో త్రిప్పాడని చెప్పాడు.

అప్పటికి చీకటి పడింది.

"ఎక్కడుంటాడు సూరిగాడు?"

"ఇంతకు ముందే వెళ్ళాడు."

"అయితే ఇల్లు తెలుసా?"

"కుర్రాళ్ళకి తెలుస్తుంది సార్! ఇప్పుడు యెవరూ లేరు."

"రేపు వస్తాడా?"

"అఁ....వస్తాడు."

"రేపు ఆ కుర్రాడు రాగానే నా దగ్గరకు తీసుకు రావాలి" అన్నాడు ఇనస్పెక్టర్.

"అచ్చా సాబ్!" అంటూ సలాం చేశాడు హమీదు.

6

ఖాకీ బట్టలు. బట్టలమీద ఆయిల్ మరకలు. చూసే వాళ్ళకి అతను మోటారు కార్ల మెకానిక్ అని తెల్సి పోతుంది. నెత్తిమీద వెంట్రుకలు అరంగుళం మందాన వున్నాయి. నెల క్రితమే ఏ తిరుపతో వెళ్ళి గుండు కొట్టించుకుని వచ్చి వుంటాడు.

"నీ పేరేనా సూరి అంటే."

"అవును సార్!" అన్నాడు సూరి.

మనిషి యెందుకో భయపడుతూ వున్నాడు.

"హోటల్ సురేఖ మేడపై నుంచి క్రిందపడి చచ్చి పోయిన అమ్మాయి నీకు తెలుసా?" ప్రశ్నించాడు ఇనస్పెక్టర్ కృష్ణమూర్తి.

"నాకు తెలీదు సార్!"

ఇనస్పెక్టర్ దగ్గరకొచ్చి లాగి గూబ అదిరేటట్టు కొట్టాడు.

"సరిగా చెప్పు!....నిజం చెప్పు! అబద్ధం చెప్పావంటే నిన్ను ఆ కేసులో ఇరికించి పదేళ్ళు జైలుశిక్ష వేయిస్తాను" కోపంతో అన్నాడు ఇనస్పెక్టర్.

హామీదు దూరంగా నిల్చున్నాడు విచిత్రంగా చూస్తూ.

సూరి బెదిరిపోయినట్లున్నాడు.

"సార్!....నన్ను కొట్టకండి. అంతా చెప్తాను" అన్నాడు ఇనస్పెక్టర్ కాళ్ళు పట్టుకుని.

"లే....ముందు. జరిగింది జరిగినట్లు చెప్పు! ఏం జరిగిందో నాకు బాగా తెల్సు. అబద్ధం చెప్పావా? మక్కెలిరుగుతాయి!...." అంటూ సూరిని బాగా బెదరేటట్లు కేకలు పెట్టాడు.

"బండి తీసికెళ్ళింది నిజమే సార్!" అంటూ నూరి హామీదు వంక బెదురుగా చూశాడు.

హామీదు ముందు అదంతా చెప్పడానికి సిగ్గుపడు తున్నాడని ఇనస్పెక్టర్‌కి అర్థమైంది. హామీదుని వెళ్ళి పొమ్మని సైగచేశాడు.

"వూఁ....ఇప్పుడు చెప్పు" అన్నాడు.

"హామీదు సాబ్ ఆరోజు వూరికెళ్ళాడు సార్. ఏడింటికల్లా షెడ్‌కి తాళంవేసేసి జహాంగీరు నేనూ దుర్గమ్మ కంపెనీకి వెళ్ళాం సార్!"

"జహాంగీరు యెవరు?"

"మా యజమాని కొడుకు."

"తర్వాత."

"దుర్గమ్మకి అర్జెంటుగా కారు కావాల్సి వచ్చింది. ఎక్కడా టాక్సీ దొరకలేదు. మేం వెళ్ళేసరికి అర్జెంటుగా ఏదైనా కారు కావాలనీ అరగంటలో తిరిగి రావచ్చనీ కారు తెస్తే ఆ రాత్రికి ఇద్దరు పిల్లల్ని డబ్బు తీసుకోకుండా పంపుతానని ఆశ పెట్టింది."

"దుర్గమ్మ నీకు బాగా తెలుసా?"

"తెలుసు సార్!"

"వూఁ....కానీ."

"జహాంగీరు అంబాసిడర్ కారు వుందని దుర్గమ్మకి చెప్పాడు. దుర్గమ్మ కారు తీసుకురమ్మని నన్ను బ్రతిమ లాడింది. ఇక కాదనలేక నేను షెడ్‌కి వచ్చి కారు తీసు కెళ్ళాను. దుర్గమ్మ, కోటయ్య కార్లో ఎక్కారు. సురేఖ హోటల్ దగ్గరికి వెళ్ళమన్నారు. దార్లో పెట్రోలు అయి పోయి బండి ఆగిపోయింది. దుర్గమ్మ బండిదిగి ద్రాక్షపళ్ళు కొంది. నేను డబ్బా తీసుకెళ్ళి ఐదు లీటర్లు పెట్రోలు

పోయించుకొచ్చాను."

"డబ్బు ఎవరిచ్చారు?"

"దుర్గమ్మే ఇచ్చింది."

"తర్వాత."

"కారు సురేఖ హోటల్‌కి తీసుకెళ్ళాను. దుర్గమ్మ కోటయ్యను నూట పదమూడు నెంబరు గదికి వెళ్ళి మోహన్ అత్తయ్య రమ్మంటుందని చెప్పింది."

"వూఁ...."

"కోటయ్య మాలతిని పిల్చుకుని వచ్చాడు. కారు దుర్గమ్మ ఇంటికి పోనివ్వమని అంది. సగం దూరం వచ్చాక ఆ అమ్మాయి హోటల్ గదిలో నెక్లెస్ మర్చిపోయానని బండి వెనక్కి పోనివ్వమంది. బండి వెనక్కి త్రిప్పి హోటల్ దగ్గరికి తీసుకెళ్ళాను. ఆ అమ్మాయి బండి దిగి హడావుడిగా హోటల్లోకి వెళ్ళింది. దుర్గమ్మ కోటయ్యను కూడా వెంట వెళ్ళమని సైగ చేసింది.

కోటయ్య ఎంత సేపటికీ రాలేదు. తర్వాత ఎవరో అమ్మాయి పైనుంచి క్రింద పడిపోయిందని అంతా గోలగా హోటల్ వెనక్కి వెళ్తుంటే దుర్గమ్మ భయపడిపోయి కారు పోనివ్వమని తొందర చేసింది. కోటయ్య రాడా అంటే, వాడు తర్వాత వస్తాడులే అంది. నేను దుర్గమ్మను దించేసి కారు షెడ్‌లో పెట్టేశాను."

"తర్వాత నువ్వు దుర్గమ్మ ఇంటికి వెళ్లావా?"

"వెళ్లాను"

"అక్కడికి కోటయ్య వచ్చాడా?"

"వచ్చాడు."

"వచ్చి ఏం చెప్పాడు?"

"మాలతి రానని మొండికెత్తిందట. తను బలవంతం

చేసేసరికి డ్రైనేజి గొట్టం నుంచి దిగాలని కిటిలోనుంచి అవతలకి దిగిందట. తను పట్టుకున్నాడట. ఆమె గింజాకుని పట్టుతప్పి పడిపోయిందట. తను భయపడి పారిపోయి వచ్చాడట. కారు ఎక్కడా కన్పించికపోయేసరికి రిక్షాలో వచ్చానని చెప్పాడు."

"తర్వాత?"

"కోటయ్య దుర్గమ్మమీద పోట్లాడాడు."

"ఎందుకు?"

"తనని వదిలి వచ్చేసినందుకు."

"బాగా పోట్లాడుకున్నారా?"

"ఆఁ....కోటయ్య వచ్చేటప్పుడే సారాయి తాగి వచ్చాడు. దుర్గమ్మ స్వార్థపరురాలనీ, తనను పోలీసులు పట్టుకుని వుంటే చచ్చివుండేవాడిననీ నానా మాటలూ అన్నాడు. అప్పుడప్పుడూ బూతులు తిట్టాడు. దుర్గమ్మ వాడికి నచ్చజెప్పింది."

"ఇప్పుడు చెప్పిందంతా కాగితంమీద రాసివ్వు" అన్నాడు ఇనస్పెక్టర్, తెల్లకాగితం, కలం ముందుకు నెట్టి.

7

దుర్గమ్మ ఇంటిమీద రైడ్ జరిగింది. కోటయ్య దొరకలేదు. దుర్గమ్మని అరెస్టుచేసి లాకప్‌లో పడేశారు.

మోహన్ అనేవాడు తన దగ్గర రెండువేలు తీసుకుని మాలతిని అమ్మాడని దుర్గమ్మ ఒప్పుకుంది. మాలతి హోటల్లోవుందనీ, తన మేనత్తనని చెప్పి ఇంటికి తీసుకొచ్చి వృత్తిలోకి దించుకోమని తనకి సలహా ఇచ్చాడనీ, ఆ ప్రయత్నంలోనే మాలతి నిజం గ్రహించి వెనక్కి వెళ్ళిపోయిందనీ ఆమె మేడపైనుంచి పడిపోయి చనిపోవడానికి తన ప్రమేయం ఏమీలేదనీ చెప్పుకొచ్చింది దుర్గమ్మ.

మాలతిని మోసం చేసి పెళ్ళిచేసుకుని వ్యభిచార గృహానికి అమ్మేసిన నేరానికి మోహన్ మీద, కొన్న నేరానికి దుర్గమ్మ మీద, దుర్గమ్మకి సహకరించి మాలతి మరణానికి కారకుడైన కోటయ్య మీద కేసు పెట్టారు పోలీసులు.

మోహన్, కోటయ్యలు పరారీలో ఉన్నారు. దుర్గమ్మ మాత్రం కేసులో ఇరుక్కుని కటకటాలు లెక్కపెడుతూ కూర్చుంది.

దుర్గమ్మకి ఒక్కడే కొడుకు. అతని పేరు చంద్రం. అతను వేరే ఉంటున్నాడు. తల్లికీ అతనికీ సంబంధం లేదు. తల్లికోసం ఎప్పుడూ రాడు కూడా. చంద్రం చదువుకున్నాడు. మున్సిపాల్టీలో ఉద్యోగం చేస్తున్నాడు.

తన తల్లిని అరెస్టు చేసి జైల్లో వేశారనే సంగతి పేపర్లో చూశాడు. చూసికూడా తెలియనట్లు ఊరుకున్నాడు.

తను జైల్లో ఉన్నట్లు తన కొడుక్కి తెలియదని దుర్గమ్మ అనుకుంది. ఈ సంగతి కొడుక్కి తెలియ జెయ్యమని ఇన్స్పెక్టర్ని బ్రతిమాలింది. ఇన్స్పెక్టర్ చంద్రానికి ఫోన్ చేసి చెప్పాడు.

చంద్రం వచ్చి తల్లిని చూశాడు. అతను ఏమీ మాట్లాడలేదు. అతను సంఘంలో గౌరవంగా జీవిస్తున్నాడు. ఆమె చీడపురుగులా బ్రతుకుతోంది. ఆమె తన తల్లి అని చెప్పుకోవడానికే సిగ్గుగావుంది అతనికి. దుర్గమ్మ కొడుకుని చూసి ఏడ్చింది, తనను జైల్లోంచి వదిలించమని.

చంద్రం బెయిల్ మీద తల్లిని విడిపించాడు.

మోహన్, కోటయ్యల గురించి అన్ని పోలీస్

స్టేషన్‌లకి మెసేజ్ పంపించారు.

వాళ్ళకోసం సి.ఐ.డి.లు గాలిస్తున్నారు.

8

పదిహేను రోజులు గడిచిపోయాయి. ముద్దాయిలు దొరకలేదు.

ఈలోగా స్థానిక వారపత్రిక 'పిడుగు' ఈ కేసు గురించి పెద్ద వ్యాసం ప్రచురించింది. పట్టణంలో స్వేఛ్ఛా వ్యభిచారం, అమాయక యువతులను బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దించుతున్న ముఠా, సంఘ వ్యతిరేఖ శక్తులతో పోలీసుల కుమ్మక్కు అనే హెడ్డింగ్‌లతో వ్యాసం పడిన 'పిడుగు' సంచిక హాట్ కేక్‌లా అమ్ముడుపోయింది.

టౌన్‌లో ఎక్కడ విన్నా ఈ కథే.

నిందితుల్ని వెంటనే పట్టుకుని అరెస్టు చెయ్యమని ఐ. జీ. నుంచి యస్పీకి టెలిగ్రాం వచ్చింది. యస్పీ డియస్పీని పర్సనల్‌గా ఈ వ్యవహారం చూడమన్నాడు. డియస్పీ ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి శీలాన్ని శంకించి నానామాటలూ అన్నాడు.

ఇన్స్‌పెక్టర్ కృష్ణమూర్తి ముఖం కందగడ్డలా పెట్టుకుని స్టేషన్‌లో కూర్చున్నాడు.

మోహన్ టౌన్‌లో ఉండివుండడు. కాని కోటయ్యగాడు ఊళ్ళోనే ఉండివుంటాడు. కనీసం వాడినైనా పట్టుకుని అరెస్టుచేసి అధికారులకు తృప్తి కలిగించాలని అనుకున్నాడు.

సి.ఐ.డి. ఇన్స్‌పెక్టర్ వినయ్‌ని దుర్గమ్మ ఇంటికి మారువేషంలో వెళ్ళి కోటయ్య ఆచూకీ తియ్యమని కోరాడు.

వినయ్ పైజామా లాల్చీ వేసుకుని తనొక విటుడినని దుర్గమ్మ నమ్మేటట్లు మేకప్ చేసుకున్నాడు.

తలుపు కొట్టేక చాలా సేపటికి తీశాడొక కుర్రాడు.

"సార్! బిజినెస్ లేదు. పోలీసులు తిరుగుతున్నారు" అన్నాడు.

వినయ్ వాడిని ఒక్క తోపుతోసి లోపలకెళ్ళాడు విసురుగా. కుర్రాడు నిర్వేరబోయి నిల్చున్నాడు.

"దుర్గమ్మా!....దుర్గమ్మా! ఏయ్...." అంటూ హడావుడిగా లోపలకు ప్రవేశించాడు.

నిద్రపోతున్నదల్లా ఉలిక్కిపడి లేచింది. గదుల్లోవున్న ఆడపిల్లలు బిక్కు బిక్కుమంటూ లేచి కూర్చున్నారు.

"ఎవరు బాబూ!" అంటూ హాల్లోకి వచ్చింది దుర్గమ్మ.

"నేనే గుర్తులేనా?" అన్నాడు నవ్వుతూ.

దుర్గమ్మ అతన్ని గుర్తుపట్టడానికి వృధా ప్రయాసపడింది. ఎందరో వస్తుంటారు, పోతుంటారు. ఎందర్నని గుర్తు పెట్టుకుంటుంది. అందులో ఆమె ఎప్పుడూ వినయ్‌ని చూళ్ళేదు కూడా! ఇంకేలా గుర్తొస్తాడు. గుర్తు లేదనడం వ్యాపార లక్షణంకాదు.

"గుర్తులేకేం? బాగున్నావా బాబూ!" అంది పెదవులకు బలవంతంగా నవ్వు పులుముకుంటూ.

"నిన్ననే మిలట్రీ నుంచి వచ్చాను" అన్నాడు.

"అలాగా బాబూ!" అంది దుర్గమ్మ ఆప్యాయంగా.

"నెలరోజులుంటాను. రోజూ వస్తుంటానులే. ఇక్కడ గిరిజని ఒక పిల్ల ఉండాలే వుందా?"

"లేదు బాబూ! అది వెళ్ళిపోయింది."

"మరి మంచిపిల్ల ఎవరున్నారు?"

దుర్గమ్మ సమాధానం చెప్పలేదు.

"ఏంటి మాట్లాడవేం?"

"ఏం లేదు. ఈమధ్య బిజినెస్ ఆపుజేశాను."

"ఏం?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఒక ఎదవ సచ్చినోడి మూలకంగా గుల్లయి పోయాను" అంటూ మాలతి మరణం గురించి చెప్పుకొచ్చింది. తను అందులో డబ్బు పోగొట్టుకుంది, పోలీసు కేసులో ఇరుక్కుంది. పైగా లక్షణంగా సాగే వ్యాపారం ఆపుజేయాల్సి వచ్చింది. పోలీసోళ్ళు రోజూ ఇంటిచుట్టూ తిరుగుతున్నారు. దుర్గమ్మకి అదంతా చెప్తుంటే నిజంగానే ఏడుపు ముంచుకొచ్చింది. వెక్కి వెక్కి ఏడ్చింది. ఇందులో నుంచి ఎట్లా బైటపడాలో తెలీకుండా వుంది బాబూ అంది కళ్ళు తుడుచుకుంటూ.

"నీకు ఆ పిల్లని అమ్మినోడిని పట్టిస్తే కేసు వాడిమీదకి పోతుందిగదా?" అన్నాడు.

"ఎక్కడున్నాడో ఆ వెధవ? పోలీసులకే దొరకడం లేదు. ఇక నాకెక్కడ దొరుకుతాడు?" అంటూ వాడిని బండ బూతులు తిట్టింది.

"పోనీ ఆ పిల్లని మేడమీద పట్టుకున్న వాడినైనా పట్టివ్వరాదా? నీమీద కేసుపోతుంది" సలహా ఇస్తున్నట్లు అన్నాడు వినయ్.

"వాడు దురమార్గుడు బాబూ! నేను పట్టిచ్చానని తెలిస్తే నన్ను కత్తితో పొడిచి చంపుతాడు. వాడి సంగతి నీకు తెలీదు. తాగుబోతు నా కొడుకు" భయంగా అంది దుర్గమ్మ.

వినయ్ నవ్వాడు.

"ఏంటో ఆశ్చర్యంగావుంది దుర్గమ్మా! ఈ వ్యాపారం చేస్తున్నావు. నువ్వొక గుండా నా కొడుక్కి భయపడ్డా

వేంటి? ఎట్లాగో వాడిని ఇరికించేసి నువ్వు తప్పుకోక. నువ్వు జైల్లోపడితే నాబోటివాడిగతి ఏమిటి?" అన్నాడు.

దుర్గమ్మ ఆలోచనలో పడింది.

"నువ్వేం భయపడమాక దుర్గమ్మా! మా మేనమామ హరిశ్చంద్రుడు తెలుసా?"

"ఆయనెవరు బాబూ?" అంది దుర్గమ్మ.

"హరిశ్చంద్రుడే తెలీదా? ఓర్నీ!" ఆశ్చర్యం నటించి "మినిష్టరు హరిశ్చంద్రుడిని తెలీనిదాన్ని నిన్నే చూస్తున్నా!" అన్నాడు.

"ఏంటీ మినిష్టరా!"

"ఆయన మా మేనమామే! నేనాయనకి చెప్పి నిన్ను వదిలిస్తాలే! ఆయన తల్చుకుంటే మర్డర్ కేసులైనాసరే ఉట్టినే ఎగిరి సముద్రంలో పడిపోవాల్సిందే!" గర్వంగా మీసాలు తిప్పాడు వినయ్.

దుర్గమ్మ ఏడుపు ముఖంలోకి కళ వచ్చింది.

"లోపలకిరా బాబూ! ఇక్కడే కూర్చుండిపోయావేంటి?" అంటూ లోపలకు దారితీసింది.

వినయ్ దుర్గమ్మ వెంట లోపలకు వెళ్ళాడు ఆ గదిలోకి. ఆ గదిలో ఫోం బెడ్ మీద దుప్పటి దులిపివేసి "కూర్చో బాబూ! నీ పేరేంటో మర్చిపోయాను" అంది.

"నర్సయ్య. మిలట్రీ నరసయ్య అంటార్లే" అన్నాడు బెడ్ మీద కూర్చుని.

దుర్గమ్మ ఫ్యాన్ ఆన్ చేసింది.

గుమ్మంవరకూ వెళ్ళి కుర్రాడిని పిలిచి అతన్ని మర్యాద చెయ్యడానికి ఆర్డర్ ఇచ్చింది.

"కోటయ్యని మామూలుగా ఇక్కడికి రమ్మనిపిలువు. వాడికి ముందే చెప్పు పోలీసులొస్తారనీ, పట్టుకెళ్తారనీ.

భయపడద్దొద్దని నచ్చజెప్పు. బెయిల్ మీద వాడిని విడిపిస్తానని నమ్మించు. చెప్పినట్లే విడిపిద్దాం. ఆనక కోర్టులో తప్పంతా ఆడిమీద పడేటట్టు చేద్దాం. వాడే జైలుకు పోతాడు. ఏమంటావు?" అన్నాడు.

దుర్గమ్మకి ఈ ఆలోచన నచ్చినట్లుంది.

"అట్టాగే చేద్దాం బాబూ!" అంది.

"కోటయ్యని ఎక్కడ దాచిపెట్టావ్?"

దుర్గమ్మ అతన్ని ఒక్క క్షణం అనుమానంగా చూసింది.

అతను కిటికీలోంచి బైటకు చూస్తున్నట్లు నటించాడు.

"ఈ ఊళ్ళోనే దాక్కున్నాడు. రేపు కాదుగాని ఎల్లుండి ఆడిని పిలిపిస్తా!" అంది దుర్గమ్మ.

"పిలిపించు. పోలీసోళ్ళు పట్టుకెళ్ళాక నాకు చెప్పు. నేను వదిలిస్తా!"

"నువ్వెక్కడ ఉంటావు బాబూ!"

"కొంపతీసి నువ్వు వస్తావా ఏం?"

"కాదు. కబురు చెయ్యడానికి."

"వద్దు .... వద్దు .... నేను రోజూ వస్తుంటాగా!" అన్నాడు నవ్వి.

కుర్రాడొచ్చి టీపాయ్ మీద క్వార్టర్ బాటిల్ విస్కీ పెట్టాడు. బజ్జీల పొట్లాం విప్పాడు.

"ఏంటిది?" అన్నాడు.

"ఏదోలే బాబూ!" అంది దుర్గమ్మ.

"నాకిదేం సరిపోద్ది. ఫుల్ బాటిల్ తెప్పిస్తే అదోక మాదిరి.... అయినా ఇప్పుడు పుచ్చుకోను. భోజనం చేసే వచ్చాను. నాకు కావలసింది ఇది కాదు" అన్నాడు

నవ్వుతూ.

"మరింకేం కావాలి నర్సయ్య బాబూ?" అప్యాయంగా అడిగింది దుర్గమ్మ.

"అందమైన పిల్ల కావాలి. మందు తాగే పిల్లయితే నాకు పరమ సంతోషం" అన్నాడు.

"దానికేం! నాకు ఉపకారం చేస్తున్న వాడివి. నీకా మాత్రం మర్యాదా చెయ్యలేనా?" అంటూ వెళ్ళిపోయింది దుర్గమ్మ నవ్వుకుంటూ.

అతను ఆమె వెళ్ళిపోగానే బెడ్ మీద పడుకుని కళ్ళు మూసుకున్నాడు.

కాసేపటికి గాజులు గలగలమన్నాయి.

వినయ్ కళ్ళు తెరిచి చూశాడు.

బ్రౌన్ కలర్ డ్రెస్‌లో దట్టంగా మేకప్ చేసుకున్న యువతి, ఆమెట్లున్న ప్లేటు టీపాయ్‌మీద పెట్టి తలుపు మూసి బోల్టు పెట్టింది.

నవ్వుతూ వచ్చి నిల్చుంది.

'రా' అంటూ కొంగు పట్టుకుని లాగాడు.

ఆమె మంచం మీద చతికిలపడి వడిలో వాలిపోయింది వగలుపోతూ.

"నీ పేరేమిటి?"

"నీలమ్మ."

"వెరీగుడ్. బాగుంది" అంటూ బాటిల్ తెరిచి గ్లాసులో పోసి నీళ్ళుపోసి అందించాడు.

"మీరు?" అంది.

"నేను భోంచేశాను."

"మరి నాకెందుకు?"

"తాగిన ఆడదంటే నాకు ఇష్టం" నవ్వాడు.

నీలమ్మ గలగల నవ్వింది. పావు గంటకి బాటిల్ పూర్తిచేసింది నీలమ్మ. కాసేపటికి ఆమెకు చెమటపట్టింది. మత్తుగా చూస్తున్నాయి కళ్ళు.

వినయ్ మరోక బాటిల్ జేబులోంచి తీసి ఓపెన్ చేసి గ్లాసులోకి వంచాడు విస్కీ.

"ఇంకానా?....చాలు...." అంది నీలమ్మ.

"తాగు.... బాగా తాగు....తాగిన తర్వాత నువ్వెంత అందంగా ఉన్నావో తెలుసా? .... ఓహ్! సినిమా యాక్ట్రెస్లా నిగనిగలాడి పోతున్నావ్!" అన్నాడు.

నీలమ్మ వుబ్బిపోసాగింది. పోసినకొద్దీ తాగి ఇష్టం వచ్చినట్లు వాగింది. అప్పుడే అడిగాడు "కోటయ్య ఎక్కడున్నాడని."నాకు తెలీదుకాని చిట్టెమ్మకి తెలుసు అంది. చిట్టెమ్మ వాడికి రోజూ అన్నం తీసికెళ్ళి పెడుతున్నదనే నిజం చెప్పింది నీలమ్మ.

తను తెచ్చిన బాటిల్ ఖాళీ అయ్యాక జేబులో పెట్టేసుకున్నాడు. కాసేపటికి నీలమ్మకి మందు ఎక్కువై వాంతి చేసుకుంది. "ఏయ్! దుర్గమ్మా!" అంటూ బోల్టు తీసుకుని పరుగెత్తాడు వినయ్.

9

తెల్లవారుజామున ఆగకుండా ఫోన్ మ్రోగసాగింది. కృష్ణమూర్తికి మెలకువ వచ్చి బెడ్ మీద పడుకునే రిసీవర్ యెత్తి 'హలో' అన్నాడు.

"సార్! నేను ఫోర్ టూవన్ సార్!"

"ఎక్కడ్నుంచి?"

"స్టేషన్ నుంచి సార్!"

"ఏమిటి?" విసుగ్గా అన్నాడు.

"ఒక గంట క్రితం దుర్గమ్మ ఇంట్లోనుంచి పాడుగాటి

పిల్లి కళ్ళ వాడు పారిపోతుంటే చూశాం సార్!"

ఇనస్పెక్టర్‌కి నిద్రమత్తు వదిలిపోయింది. లేచి కూర్చున్నాడు.

"మరి పట్టుకోలేక పోయారా?"

"పరిగెత్తాం సార్! కాని దొరకలేదు. తప్పించుకుని పారిపోయాడు."

"ఏడ్చారు. వాడు పారిపోతుంటే వెర్రి ముఖాలేసుకుని చూస్తూ నిల్చుని ఇప్పుడేదో ఘనకార్యం చేసినట్లు చెప్తున్నారా?"

"లేదు సార్! చాలాదూరం వెంటపడ్డాం సార్!"

"చాల్లే నోర్మూయ్యండి. అసలు మీరు అక్కడెందుకున్నారు?"

"పెట్రోలింగ్ తిరుగుతున్నాం సార్!"

"సరే! ఇప్పుడెందుకు ఫోన్ చేసినట్లు?"

"ఆ పిల్లి కళ్ళ వాడు కనిపిస్తే వెంటనే చెప్పమన్నారుగా సార్!"

"వెంటనే అంటే గంట తర్వాతా?"

"అక్కడ్నుంచి స్టేషన్ కొచ్చేసరికి గంట పట్టింది సార్!"

ఇనస్పెక్టర్ ఫోన్ పెట్టేసి పడుకున్నాడు.

అయితే ఆ కోటయ్యని పిలిపిస్తానని చెప్పినట్లు చేసిందన్నమాట దుర్గమ్మ. మరి వాడు వచ్చి ఎందుకు పారిపోయినట్లు?

నిద్రా భంగమైన తర్వాత ఇనస్పెక్టర్‌కి ఇక నిద్రపట్టలేదు. పడుకునే ఆలోచించసాగాడు. ఎంత ఆలోచించినా కోటయ్య ఎందుకు పారిపోయాడు అనే విషయం అంతుపట్టలేదు.

ఇంతలో తెల్లవారింది.

తూర్పు ఎర్రబడింది.

ఫోన్ రింగయింది.

"ఇనస్పెక్టర్ కృష్ణమూర్తి స్పీకింగ్!" అన్నాడు.

"సార్! యస్.ఐ. స్వామిని మాట్లాడుతున్నాను."

"ఏమిటి ప్రొద్దున్నే."

"సార్! దుర్గమ్మ సూసైడ్ చేసుకుందట."

"వాట్?"

"యస్సార్!"

"మైగాడ్!" అన్నాడు.

"నన్ను అక్కడికి వెళ్ళమంటారా? ఇక్కడ మీకోసం వెయిట్ చెయ్యనా?"

"దుర్గమ్మ ఇంటిదగ్గరే వుండు. ఎవర్నీ ఏమీ ముట్టుకో నివ్వకు. బీ కేర్ ఫుల్."

"యస్సార్!"

ఇనస్పెక్టర్ ఫోన్ పెట్టేశాడు.

10

"గుడ్ మార్నింగ్ మిస్టర్ వినయ్!"

"గుడ్ మార్నింగ్! ఎవరూ?"

"నేను కృష్ణమూర్తిని."

"వాట్ సార్?"

"దుర్గమ్మ చచ్చిపోయింది."

"ఈజిట్?"

"యస్."

"ఎలా?"

"సూసైడ్ అని అంటున్నారు. ఒక కుర్రవాడొచ్చి రిపోర్టు చేశాడట అలా అని. కాని నేనిది హత్య ఏమో

నని సస్పెక్టు చేస్తున్నాను.

"ఎలాగ?"

"తెల్లవారుజామున కోటయ్య ఆ ఇంట్లోనుంచి పారి పోతుంటే మనవాళ్ళు చూశారు పెట్రోలింగ్ చేస్తూ. కాని వాడు దొరకలేదు. వాడే మర్డర్ చేసి పారిపోయా డేమోనని నా అనుమానం."

"అలా కూడా కావచ్చు. కాని కోటయ్య దుర్గమ్మని యెందుకు మర్డర్ చేసివుంటాడు?"

"మన ప్లాన్ దుర్గమ్మ వాడికి చెప్పి వుంటుంది. కాని అది వాడికి అర్థమై వుండదు. పోలీసులు పట్టుకోవడం ఏమిటి? మళ్ళీ వదలటం ఏమిటి? అని అనుమానించి వుండొచ్చు. తనను దుర్గమ్మ జైలుకి పంపడానికి ప్లాన్ వేస్తున్నదేమోనని సందేహించి కోపంవచ్చి దుర్గమ్మని మట్టు పెట్టి వుండొచ్చు."

"నేను మరోకలా ఆలోచిస్తున్నాను."

"నేను దుర్గమ్మతో మాట్లాడినదంతా వాడికి తెలిసి పోయి ఈ దుర్మార్గం చేసి వుండొచ్చు."

"ఎలా తెలుస్తుంది వాడికి?"

"అవకాశం వుంది. చిట్టెమ్మనే బ్రోతల్ ఒకతె వాడికి పెట్. అది ఇన్ఫర్మేషన్ చేరవేసి వుంటుంది. ముందు ఆ ఇంట్లో వున్న చిట్టిని పట్టుకోండి. దానికి తెలుసు కోటయ్య యెక్కడ వున్నాడో!"

"గుడ్! నేను అక్కడికే పోతున్నాను. వెంటనే నువ్వొస్తే ఏదైనా క్లూ చిక్కుతుంది."

"ఇప్పుడే వస్తున్నాను" అన్నాడు వినయ్ ఫోన్ పెట్టేస్తూ.

11

ఇనస్పెక్టర్ దుర్గమ్మ వుండే ఇంటికి వెళ్ళేసరికి ఆ సందులో జనం చేరి వున్నారు.

యస్.ఐ. స్వామి సెల్యూట్ చేసి కృష్ణమూర్తిని దుర్గమ్మ శవం వున్న గదిలోకి తీసికెళ్ళాడు.

దూలానికి వ్రేలాడుతోంది శవం. అది పెంకుటిల్లు. ఆ దూలానికి తాడు కట్టడం ఆడవాళ్ళకి సాధ్యమయ్యే పని కాదు.

నీలిరంగు నైలాన్ తాడు లావుపాటిది కంఠానికి వురి పెట్టబడి వుంది. కాళ్ళక్రింద టీపాయ్ వుంది.

కాసేపటికి వినయ్ వచ్చాడు.

"నాట్ సూసైడ్" అన్నాడు నెమ్మదిగా.

వేలిముద్రల నిపుణుడు వేలిముద్రల కోసం వెతుకుతున్నాడు.

గదిలో ఏదైనా క్లూ దొరుకుతుందేమోనని గాలించారు. ఒకమూల నీళ్ళు పోవడానికి పెట్టిన కన్నం దగ్గర ఎర్రరంగు పెన్ దొరికింది. వేలిముద్రలకోసం దాన్ని భద్రపరిచారు.

శవాన్ని పోస్టుమార్టం కోసం పంపారు.

నలుగురు అమ్మాయిలు, ఒక కుర్రాడు వున్నారు. వాళ్ళని ప్రశ్నిస్తే మాకేం తెలియదన్నారు. వాళ్ళు రెండో ఆట సినిమాకని వెళ్లారట. తిరిగి వచ్చేసరికి రెండు గంటలు దాటి వుంటుంది. ప్రహరీ గోడ గది తీసే వుంటుందట. తనకు నిద్రాభంగమవుతుందని దుర్గమ్మే అలా చెప్పిందట. తెల్లవారి లేచి చూసేడట ఆ కుర్రాడు. తలుపు నెట్టేసరికి దుర్గమ్మ శవం కన్పించిందట.

"గమ్మత్తుగా వుందే!" అన్నాడు కృష్ణమూర్తి.

"ఇది వాడి పనే! కోటయ్యగాడిని పట్టుకుంటే తేలి పోతుంది" అన్నాడు వినయ్.

అంతలోకి దుర్గమ్మ కొడుకు చంద్రం వచ్చాడు అక్కడికి.

"సారీ మిష్టర్ చంద్రం" అన్నాడు ఇనస్పెక్టర్.

చంద్రం కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

"ఇలా జరుగుతుందని నాకు ఎప్పుడో తెల్సుసార్! ఇది మా సెయ్యమని ఎన్నోసార్లు బ్రతిమాలాను. కాని ఒప్పుకుంది కాదు. అందుకే నేను ఇక్కడకు రావడం కూడా మానుకున్నాను. అంతా ఖర్మ!" అన్నాడు విచారంగా.

12

"నాకేం తెలీదయ్యా!" అన్నాడు కోటయ్య ఏడుపు ముఖం పెట్టి.

"నువ్వు తెల్లవారుజామున ఆ ఇంట్లోంచి యెందుకు పారిపోయావో చెప్పు మరి."

"దుర్గమ్మ శవాన్ని చూసి భయంవేసి పారిపోయా నయ్యా!" అన్నాడు కోటయ్య.

"దుర్గమ్మ శవాన్ని ఎందుకు చూశావు ఆ టైమ్‌లో."

"దుర్గమ్మకి తెల్లవారుజామునే నిద్రలేచే అలవాటుం దయ్యా! అందుకే లేచిందేమో చూశాను."

"దుర్గమ్మ ఇంటికి ఎప్పుడు వెళ్ళావు?"

"రాత్రి పదింటికి దుర్గమ్మ ఇంటికి బయల్దేరాను. దారిలో మా వాళ్ళంతా ఎదురై సినిమాకెళ్తున్నామని చెప్పారు. నన్నుగూడా రమ్మని బ్రతిమాలారు. సినిమా అయ్యాక వాళ్ళతోపాటే ఆ ఇంటికి వచ్చాను. తలుపు తీసే వుంది. ఎవరి గదుల్లో వాళ్ళు పడుకున్నారు. చిట్టీ నేనూ ఒక గదిలో పడుకున్నాం."

"బాగుంది. అసలు నువ్వు యెక్కడో దాక్కున్నావు గదా! మరి దుర్గమ్మ ఇంటికి యెందుకు వచ్చావు?"

"రమ్మని కబురు చేస్తే వచ్చానయ్యా!" అన్నాడు.

"ఎవరితో కబురు చేసింది?"

"చిట్టితో."

"ఏమని. వట్టినే రమ్మందా? ఇంకేమన్నా కబుర్లు చెప్పిందా?"

"పోలీసులు పట్టుకున్నా వదిలేసే ఏర్పాటు చేశాను. రమ్మనీ, భయం ఏమీ లేదనీ కబురు పెట్టిందయ్యా!"

"అంతేనా? చిట్టి ఇంకేవీ చెప్పలేదా?"

"దుర్గమ్మ అంతే చెప్పిందంట."

"అయితే నువ్వు దుర్గమ్మని చంపలేదంటావు?"

"లేదయ్యా! దేవుడి సాక్షిగా నిజం చెప్తున్నాను."

"వీణ్ని లాకప్‌లో పడేయండి. అంత తేలిగ్గా చెప్తాడా?" అన్నాడు ఇనస్పెక్టర్.

ఇద్దరు కానిస్టేబుళ్ళు కోటయ్యని లాక్కెళ్ళి లాకప్‌లో పడేశారు.

"నాకేం తెలీదయ్యా!" అంటూ ఏడుస్తున్నాడు కోటయ్య.

13

అర్ధరాత్రి పన్నెండు గంటలకు దుర్గమ్మ ప్రాణం పోయింది. గొంతుపిసికి చంపారు. తర్వాత మెడకి తాడు కట్టి ఆత్మహత్య చేసుకుందని నమ్మించడానికి ప్రయత్నం చేశారు.

పోస్టుమార్టమ్‌లో తేలిన అంశాలు అవి.

ఎర్రరంగు పెన్నుమీద వేలిముద్రలు దొరికాయి. దుర్గమ్మ గొంతుమీద వేలిముద్రలు లేవు. టవలుతో తుడిచి

నట్లుంది. ఆ ఎర్ర పెన్ను ఎవరిదో ఆ ఇంట్లో ఎవరూ గుర్తుపట్టలేక పోయారు. కోటయ్య వేలిముద్రలు ఆ పెన్నుమీద వాటితో టాలీ కాలేదు.

వీళ్ళంతా సినిమాకు వెళ్ళిన సమయంలో ఎవరో కొత్త వ్యక్తి దుర్గమ్మను కలిశాడు. ఏదో బలమైన కారణంవల్ల అతను దుర్గమ్మను చంపాడు.

ఎవరా కొత్త వ్యక్తి?

మాలతిని దుర్గమ్మకు అమ్మిన మోహన్ అనే యువకుడై వుంటాడా?

మోహన్ కోసం పోలీసుల అన్వేషణ తీవ్రం చేశారు.

ఫింగర్ ప్రింట్స్ బ్యూరోకు వేలిముద్రలు పంపారు. పాత నేరస్థుల జాబితా వెతకసాగారు.

వేలిముద్రలు పాత నేరస్థుడివి కావని బ్యూరోనుంచి సమాచారం వచ్చింది.

అధికారులు వత్తిడి చేసినకొద్దీ కేసు మరింత జటిలమై పోయి ముందుకు సాగడం లేదు.

మాలతి, కోటయ్యవల్లే చనిపోయిందని కేసుపెట్టి కోర్టు చుట్టూ తిప్పుతున్నారు పోలీసులు.

దుర్గమ్మ మర్డర్ కేసు పోలీసుల్ని తికమక పెట్టసాగింది. దుర్గమ్మ ఇంట్లో వున్న బ్రోతల్స్‌ని యెక్కడికీ పోనివ్వకుండా వాళ్ళని యెవరెవరు కలుసుకుంటున్నారో నిఘా వేశారు. ప్రయోజనం కన్పించడంలేదు.

దుర్గమ్మని కోటయ్య చంపలేదేమోననిగూడా అనిపిస్తోంది. కోటయ్య ఇంత తెలివిగా దుర్గమ్మని చంపలేడు. మెడమీద వేలిముద్రలు పడతాయని అతనికి తెలిసేటంత తెలివైనవాడు కాడు. ఎవరో బాగా చదువుకున్నవాడే ఈ హత్య చేశాడు.

14

కె. చంద్రం, మున్సిపల్ ఆఫీస్ అనే నేమ్ ప్లేట్ చూసి ఆగిపోయాడు అతను.

అదొక సింగిల్ రూమ్. రోడ్డుకి అనుకునే వుంది. తలుపు వారగా వేసివుంది.

అతను రూమ్ ముందు నిల్చున్నాడు.

నెమ్మదిగా వ్రేళ్ళతో తట్టాడు.

"ఎవరూ?"

"మే ఐ కమిన్ ప్లీజ్!"

"యస్."

తలుపు తెరుచుకుంది.

చంద్రం లుంగీతో వున్నాడు.

సినిమా పత్రిక తాబోలు చదువుకుంటున్నాడు.

గది కాస విశాలంగానే వుంది. సింగిల్ కాట్. గాడ్రెజ్ బీరువా. నిలువెత్తు అద్దం. దండెంమీద మాసిన బట్టలు. అతను గది పరికించి చూస్తున్నాడు.

"లోపలకు రండి" అంటూ కుర్చీ ఫోల్డు విప్పాడు.

అతను తాపీగా కూర్చుని "నేను విజయలక్ష్మి బ్రదర్ని" అన్నాడు.

చంద్రం ముఖం వికసించింది.

"మీ పేరు రాంప్రసాద్ గదూ! గ్లాడ్ టూ మీట్ యూ!" అంటూ షేక్‌హేండ్ ఇచ్చాడు చంద్రం.

అతను నవ్వి వూరుకున్నాడు.

"మిలట్రీలో పని చేస్తున్నారటగా!"

"అవును."

"ఎప్పుడొచ్చారు?"

"ఈ రోజే. మీ గురించి సిస్టర్ చెప్పింది. మాట్లాడి

పోదామని వచ్చాను. ఇంత అర్జంట్‌గా యెందుకొచ్చావంటే రేపు మా అంకుల్ ఇంటికి వెళ్తున్నాను. సెటిల్ అయితే మా మావయ్యగారి అమ్మాయితో ఈ నెలవల్లో పెళ్ళి జరుగుతుంది” అతను కొంచెం సిగ్గుపడినట్లు అభినయించాడు.

“మీకింకా పెళ్ళికాలేదా?”

“లేదు. మిలట్రీవాణ్ని గదా! శరీరం కాస్త లావు. నాకింకా ధర్టీ నిండలేదు” అన్నాడు.

“ఇంకా యెన్కువ వున్నట్లు అనిపిస్తారు.”

“అవును....!”

“ఏమిటి విశేషాలు చెప్పండి?”

“మీరే చెప్పాలి. మీ గురించి సిస్టర్ చెప్పింది. కాని మీ మదర్ బ్రోతల్ బిజినెస్ చేస్తారట గదా! మా ఫాదర్, మదర్ అంత సుముఖంగా లేరు. అంత ఏమిటిలెండి? మిమ్మల్ని అల్లుడిగా చేసుకోవడానికి ఒప్పుకోవడం లేదు” అన్నాడు అతను.

చంద్రం ముఖం నల్లబడిపోయింది.

“అదేమిటి? మీ వాళ్ళు ఇష్టపడుతున్నారని మీ సిస్టర్ చెప్తుందే?” ఆశ్చర్యంగా అన్నాడు చంద్రం.

“మా సిస్టర్ మీగురించి చెప్పినప్పుడు వాళ్ళు అంతా తెలుసుకుని నాకు లెటర్ రాశారు. మీకు ఇష్టం లేక పోయినా అమ్మాయితో ఆ సంగతి చెప్పొద్దని నేను సలహా ఇచ్చాననుకోండి. అందుకే అయిష్టంగా చెప్పి వుండరు.”

చంద్రం ముఖం వాల్చుకుని కూర్చున్నాడు.

“వ్యభిచార వృత్తి చేసే కుటుంబంలోకి యెవరు మాత్రం పిల్లను ఇస్తారు లెండి” అన్నాడు.

"మా అమ్మకూ నాకూ సంబంధం లేదు. అదీ కాక ఆమె చనిపోయిందిగూడా! నేను గౌరవంగా వుద్యోగం చేసుకుంటున్నాను" సీరియస్‌గా అన్నాడు చంద్రం.

"డోంట్ మిస్‌అండర్‌స్టాండ్ మీ! లోకం పోకడ చెప్పాను. అఫ్‌కోర్స్ అందులో మీ తప్పు ఏముంది లెండి. నాకంత పట్టింపులేవీ లేవు. ప్రోగ్రెసివ్ థాట్స్ వున్నాయి నాకు."

"థాంక్స్" అన్నాడు చంద్రం.

"బైదిబై మా సిస్టర్‌తో మీకు ఎలా పరిచయం కలిగింది?"

"మీ సిస్టర్ చెప్పలేదా?"

"ఆడపిల్లని అవన్నీ యెందుకు అడగాలని వూరుకున్నాను."

"మీ సిస్టర్ టీచర్‌గా పని చేస్తున్న కాన్వెంట్ స్కూల్ దగ్గర్లో ఒక రూమ్‌లో వుంటుండే వాడిని. మా బాస్ పిల్లల్ని అడ్మిట్ చెయ్యడానికి వెళ్ళినప్పుడు పరిచయం కలిగింది. ఆ తర్వాత అది డెవలప్ అయింది" అన్నాడు చంద్రం.

"మా సిస్టరు మీ అమ్మగారి వృత్తి గురించి ఎప్పుడూ తన అభిప్రాయం చెప్పలేదా?"

"చెప్పింది. ఆవిడను మాన్పించాలని నేనూ ప్రయత్నించాను. కాని ఆమె అలా అలవాటు పడిపోయింది. ఎనీ హౌ షీ కమిటెడ్ సూసైడ్" అన్నాడు చంద్రం.

ఆ తర్వాత కాసేపు మాట్లాడుకున్నారు. రాంప్రసాద్ తన జేబులో పెన్ తీసి అతనికి అందించి అడ్రస్ రాసివ్వమనీ లెటర్స్ రాస్తుంటాననీ చెప్పాడు.

చంద్రం పెన్ అందుకుని తెల్లకాగితం మీద తన

ఆఫీసు అడ్రెస్ రాసి ఇచ్చాడు.

రామ్‌ప్రసాద్ పెన్, కాగితం అందుకుని వెళ్ళొస్తానని చెప్పి సెలవు తీసుకున్నాడు.

15

చంద్రం ఆఫీసుకు వెళ్ళగానే విజయలక్ష్మితో మాట్లాడాలని కాన్వెంట్ కి ఫోన్ చేశాడు.

"గుడ్ మార్నింగ్ విజయా!"

"గుడ్ మార్నింగ్ చంద్రం!"

"ఏమిటి సంగతి?"

"రాత్రి మీ బ్రదర్ నన్ను కలిశాడు."

"మా బ్రదర్ యెవరు?"

"మిలటరీలో పని చేస్తున్నాడని చెప్పావు చూడు! రాంప్రసాద్!"

"ఏమిటి నువ్వనేది?"

"రాంప్రసాద్! మీ అన్నయ్య నన్ను కలిశాడంటున్నాను. ఎందుకట్లా ఆశ్చర్యపోతావు?"

"ఏడ్చినట్లుంది. మా అన్నయ్య అసలు పూర్ణించి రానిదే నిన్నెట్లా కలిశాడు? గమ్మత్తుగా వుందే! వేళాకోళం చేస్తున్నావా ఏమిటి?"

"నో....నిజమే!"

"అంతా అబద్ధం."

"లేదు విజయా! లావుగా వున్నాడు. మీసాలుగూడా వున్నాయి. మిలట్రీ వాడిలాగే కన్పించాడు."

"అతను మా అన్నయ్య మాత్రం కాదు! ఎవరో నిన్ను బోల్తా కొట్టించారు. డబ్బులేమైనా అడిగాడా ఏం? అతనెవరో మోసగాడై వుంటాడు."

"లేదు, నన్ను డబ్బులేమీ అడగలేదు. అలా బజారు

కళ్ళు టీ తీసుకుందామని అడిగినా వద్దన్నాడు. లెటర్స్ రాస్తుంటానని అడ్రస్ తీసుకున్నాడు" చంద్రానికి అంతా ఆశ్చర్యంగా వుంది.

"గుడ్ మార్నింగ్ మిస్టర్ పరశురామ్!"

చంద్రం ఫోన్ పెట్టేసి "నా పేరు చంద్రం సార్!" అన్నాడు ఇనస్పెక్టర్ కృష్ణమూర్తితో.

"అఫ్ కోర్స్! కాని తల్లిని చంపిన పరశురాముడు నువ్వూ ఒకే కోవకి చెందుతారని నేనలా పిలిచాను."

"సార్!.... సార్!"

"రాత్రి నిన్ను కలుసుకున్న వాడు మా వాడే. సి.ఐ.డి. ఇనస్పెక్టర్. నీ వేలిముద్రల కోసం నీ ప్రేయసి అన్నగా నాటకం ఆడాడు. మీ అమ్మని తెలివిగా చంపావు. కాని నీ పెన్ అక్కడ మర్చిపోయావు. అఫ్ కోర్స్ హంతకుడు ఏదొక పొరపాటు చెయ్యడం సహజం అనుకో. ఆ పెన్ మీద నీ వేలిముద్రలు దొరికాయి. రాత్రి నీ వేలిముద్రలు మళ్ళీ పెన్ మీదనే సంపాదించాం. ఖచ్చితంగా సరిపోయాయి. నౌ యూ ఆర్ అండర్ అరెస్ట్!" ఇనస్పెక్టర్ కృష్ణమూర్తి కంఠం కంచులా మ్రోగింది.

చంద్రం కాళ్ళక్రింద భూమి కదిలింది.

పోలీసు కానిస్టేబుళ్ళు అతని చేతులకు బేడీలు తగిలించారు.

—: ఐపోయింది :—